జాతీయస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

యోగా చాంపియన్ కొంపెల్లి రమేశ్‌ను సన్మానిస్తున్న వ్యాపారులు

మందమర్రి, డిసెంబర్ 30 : బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో ఆదివారం ఇండియా యోగా స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో మందమర్రి పట్టణానికి చెందిన కొంపెల్లి రమేశ్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు. 300 మంది పాల్గొన్న ఈ పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన ఆయనను సోమవారం స్థానిక పాత బస్టాండ్ ఏరియా వ్యాపారులు శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొంపెల్లి రమేశ్ మాట్లాడుతూ.. క్రమ శిక్షణ గల జీవన విధానం, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. యోగాపై ఉన్న మక్కువతో పలు శిక్షణలు పూర్తి చేసి, ఎస్ వ్యాసా యూనివర్సిటీలో ఎంఎస్సీ యోగా చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగాభ్యాసం చేసి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మందమర్రి సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా తరగతుల్లో మాస్టర్ ముల్కల్ల శంకర్ వద్ద శిక్షణ తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సేవా సమితి ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వారిలో ఎస్ శ్రీలత(బంగారు), సుజాత, మచ్చయ్య, దామోదర్, కృష్ణవేణి, లత (వెండి) పతకాలు సాధించారని వివరించారు. కార్యక్రమంలో వ్యాపారులు వడ్లకొండ కనకయ్య, ఆగుళ్ల తిరుమలేశ్, నకోటి వెంకటేశ్వర్లు, బింగి రాజన్న, శ్రీనివాస్, మహేందర్, ప్రసాద్, సత్యం, మార్కండేయ, సత్యనారాయణ, బత్తుల శంకర్ తదితరులున్నారు.

యూనివర్సల్ బ్యాంక్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా సహకార శాఖ అధికారి సంజీవ రెడ్డి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 30 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని యూనివర్సల్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో సోమవారం 2025 బ్యాంకు క్యాలెండర్, డైరీని జిల్లా సహకార శాఖ అధికారి సంజీవ రెడ్డి ఆవిష్కరించారు. ఖాతాదారులకు మంచి సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందుతున్నదని పేర్కొన్నారు. బ్యాంక్ టర్నోవర్ రూ.98 కోట్లు ఉన్నదని తెలిపారు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంక్ చైర్మన్ వీ వినయ్ కుమార్, సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్లు జీ రాజలింగు, శ్రీదేవి, ఐవీఎన్ఎస్ ఆదిత్య, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫారాలు ఇప్పించాలి

మందమర్రి, డిసెంబర్ 30 : సింగరేణిలో పని చేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు యూనిఫారాలతో పాటు, రక్షణ పరికరాలను ఇప్పించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు ఏడాదికి కాంట్రాక్టర్ ద్వారా రెండు యూనిఫారాలు, రక్షణ పరికరాలు ఇప్పించాలని యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గతంలో సెక్యూరిటీ గార్డులు కాంట్రాక్టర్ వద్ద డ్రెస్‌లు, షూ కొనుగోలు చేసేవారని, డబ్బులు లేదంటే అధికారులు ఒత్తిడి తీసుకువచ్చి అవసరమైతే విధులు కూడా నిలిపివేయాలనేవారని తెలిపారు. అధికారులు జోక్యం చేసుకొని సెక్యూరిటీ గార్డులకు డ్రెస్‌లు, రక్షణ పరికరాలను కాంట్రాక్టర్ల ద్వారా ఇప్పించాలని కోరారు.

నేరాలు పెరిగినయ్

- 6,054 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు.. 2,117 మందికి జరిమానా
- 10,132 పెట్టి.. గంజాయికి సంబంధించి 58
- 143 మంది అరెస్ట్.. 20.54 కిలోలు స్వాధీనం
- రామగుండం సీపీ శ్రీనివాస్
- పోలీస్ 2024 సంవత్సర వార్షిక నివేదిక విడుదల

వివరాలు వెల్లడిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 30 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2024 సంవత్సరంలో నేరాల తీవ్రత పెరిగిందని, గతేడాదితో పోలిస్తే కేసులు కూడా అధికంగా నమోదయ్యాయని సీపీ శ్రీనివాస్ వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి, ట్రాఫిక్ చలాన్, గ్యాంబ్లింగ్, తదితర కేసుల సంఖ్యా పెరిగినట్లు వివరించారు. రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో 2024 వార్షిక నేరాల నివేదికను ఆయన మీడియాకు విడుదల చేసి, వివరాలు వివరించారు. 2023లో మంచిర్యాల జోన్ పరిధిలో 5,115 కేసులు నమోదవగా, 2024 సంవత్సరంలో 4,455 కేసులు నమోదయ్యాయన్నారు. 121 గ్రేవ్ కేసులు, 10,132 పెట్టి, ఒక హత్య, రాబరీ, 228 దొంగతనం, 55 కిడ్నాప్, 41 రేప్ కేసులు, 371 చీటింగ్ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. హత్యాయత్నం 40, మిస్సింగ్ 273 కేసులు సమోదైనట్లు తెలిపారు. 2024లో పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవడంతో పాటు, రూ.1.79 కోట్లతో పాటు, 3,216 లీటర్ల అక్రమ మద్యం, 11.48 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘునకు సంబంధించి మంచిర్యాల జోన్ పరిధిలో 2,15,927 కేసులు నమోదవగా, రూ.5లక్షల మేర జరిమానా విధించినట్లు వివరించారు. 6,054 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదవగా, 2,117 మందికి రూ.32.84 లక్షల పైచిలుకు జరిమానా విధించినట్లు తెలిపారు. 85 గ్యాంబ్లింగ్ కేసులు నమోదవగా, 561 మందిని అరెస్ట్ చేసి, రూ.28.30 లక్షలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. అలాగే 58 గంజాయి కేసులు నమోదవగా, 143 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 20.54 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. తరచుగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే 41 మందిపై హిస్టరీ షీట్స్, అందులో 33 మందిపై రౌడీ షీట్లను ఓపెన్ చేసినట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా మొత్తంగా 23,083 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ మధ్యకాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్నదని, ఆరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో 281 సైబర్ కేసులు నమోదవగా, సుమారు రూ.5.20 కోట్ల సొమ్ము బాధితులు పోగొట్టుకున్నట్లు సీపీ తెలిపారు. పల్లె నిద్ర, ఆపరేషన్ గరుడ, వైద్య శిబిరాలు, కార్మికుల పిల్లల కోసం వర్క్ సైట్ పాఠశాల ఏర్పాటు చేసి, సామాజిక నేరాల సంఖ్యను అదుపు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో మంచిర్యాల, పెద్దపల్లి డీసీపీలు ఎగ్గడి భాస్కర్, చేతన, డీసీపీ అడ్మిన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వినతులు

హాజీపూర్, డిసెంబర్ 30 : జిల్లాలో కలెక్టరేట్, మండల కేంద్రాల్లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజలు వినతులు సమర్పించారు. అధికారులు స్వీకరించి, పరిశీలించారు. మంచిర్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్ట కబ్జాలను తొలగించాలని కోరుతూ కలెక్టర్ దీపక్ కుమార్‌కు స్వచ్ఛంద పౌర సేవా సంస్థ నాయకులు వినతి పత్రం అందజేశారు. హైటెక్ సిటీ, జాఫర్ నగర్ వైపున చెరువు కట్టను కొందరు కబ్జా చేశారన్నారు. రోడ్లు, భవనాలను నిర్మిస్తున్నారని, నిత్యం వేలాది మంది ప్రజలు చెరువు కట్టపై వాకింగ్ చేస్తుంటే సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గతంలో కట్టపై ఉన్న వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించాలని కోరారు. అన్ని వైపులా నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పౌర సేవా సంఘం అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి తులా మధుసూదన్, సభ్యులు రంగు రాజేశం, ప్రదీప్ కుమార్, రాధేశ్యామ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్ : కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న స్వచ్ఛంద పౌర సేవా సంస్థ నాయకులు

చెరువును కాపాడాలి

దండేపల్లి, డిసెంబర్ 30 : నాగసముద్రం చెరువును కాపాడాలని గ్రామస్తులు తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందించారు. 15, 16 సర్వే నంబర్‌లోని భూములు చెరువు ఏర్పడ్డనాటి నుంచి ప్రధాన రహదారి వరకు ఉండేవన్నారు. చెరువు నీర్లు రోడ్డుకు ఆనుకొ ని ఉండేవని తెలిపారు. కొందరు మట్టి పోసి ఆక్రమించారని పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయండి

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 30 : కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు వినతులు అందజేశారు. జిల్లా కేంద్రంలో యువత, వాకర్స్ కోసం ఓపెన్ జిమ్, అలాగే పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, జనకాపూర్ క్రీడా మైదానంలో సౌకర్యాలు కల్పించాలని డీవైఎఫ్ఐ నాయకులు అదనపు కలెక్టర్ దీపక్ తివారీకి వినతి పత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీకానంద్, గొడిసెల కార్తిక్, సహాయ కార్యదర్శి రాజ్ కుమార్, శ్రీకాంత్ ఉన్నారు.

దండేపల్లి : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

భీమారంలో..

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి

దహెగాం, డిసెంబర్ 30 : న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని దహెగాం ఎస్ఐ కందూరి రాజు ప్రజలు, యువతకు సూచించారు. డిసెంబర్ 31 రాత్రి 12:30 గంటలలోపే వేడుకలు జరుపుకోవాలని, ఆ తర్వాత కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పటాకులు, మైకులు, సౌండ్ సిస్టమ్ ఉపయోగించవద్దని, మద్యం తాగి వాహనాలు నడుపవద్దని సూచించారు. 31 రాత్రి ప్రత్యేక పోలీస్ బృందాలు పెట్రోలింగ్ చేపడుతున్నట్లు తెలిపారు.

దండేపల్లి, డిసెంబర్ 30 : నూతన సంవత్సర వేడుకల్లో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని దండేపల్లి ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. 31వ తేదీన రాత్రి మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేసి ఇతరులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. అసభ్య సందేశాలు, ఫొటోలు, వీడియోలు పంపిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెన్నూర్ టౌన్, డిసెంబర్ 30 : నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ ఆకాంక్షించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, ప్రమాదాలకు దూరంగా ఉంటూ పోలీసుల సూచనలు పాటించాలని యువత, ప్రజలకు సూచించారు. మద్యం దుకాణదారులు, రెస్టారెంట్ యజమానులు ప్రభుత్వం అనుమతించిన సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం నుంచే పోలీసుల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కెరమెరి, డిసెంబర్ 30: నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఎస్ఐ విజయ్ హెచ్చరించారు. వేడుకల్లో వినోదాన్ని విషాదంగా మార్చుకోవద్దని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నటు తెలిపారు. నిర్ణీత సమయంలో మద్యం దుకాణాలను మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయించవద్దని సూచించారు.

వాంకిడి, డిసెంబర్ 30 : మండలంలో మంగళవారం పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని, సాయంత్రం 7 గంటల నుంచి 20 మంది పోలీస్ సిబ్బందితో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్రోలింగ్ ఉంటుందని వాంకిడి సీఐ సత్యనారాయణ తెలిపారు. ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసినట్లు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, వాహనాలు నడిపినా చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 30 : కిష్టంపేట గ్రామ సమీపంలోని సుద్దాల క్రాసింగ్ వద్ద 63వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నూర్ పట్టణంలోని గెర్రె కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు చింతకింది రమేశ్ (33) మృతి చెందాడు. చెన్నూర్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్ శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5 బొగ్గు గనిలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం గని వద్ద మైసమ్మకు చేస్తున్నారని, మాంసం తీసుకవస్తానని భార్యతో చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. అక్కడి నుంచి బీ జోన్‌లో ఉంటున్న తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. రాత్రి చెన్నూర్‌కు తిరిగి వస్తుండగా, బైకు అదుపు తప్పి రోడ్డు పక్కన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం అటు వైపు వెళ్తున్న వారు చూసి, పోలీసులకు సమాచారం అందించారు. బైకు ఆధారంగా మృతుడి వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య శ్వేత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

నస్పూర్, డిసెంబర్ 30 : జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు విష్ణు, ప్రకాశ్, దీపక్ ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబురావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను డీఐఈవో అంజయ్య, పీడీ బాబురావు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

జన్నారం, డిసెంబర్ 30 : మండలంలోని మొర్రిగూడ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఇందన్‌పల్లి రేంజ్ ఆఫీసర్ కే శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనుమతులు లేకుండా వాగులు, అడవుల నుంచి ఇసుక తరలించే వారిపై అటవీ శాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దాడి చేసిన వారిపై కేసు

బెల్లంపల్లి, డిసెంబర్ 30 : ఆరిజన్ డెయిరీ సీఈవో కందిమల్ల ఆదినారాయణపై దాడికి పాల్పడిన సతీశ్, శ్యామ్‌తో పాటు, మరో ఆరుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. యూనియన్ బ్యాంక్‌లైన్‌లో సెలూన్ వద్ద ఉన్న ఆదినారాయణపై దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో మిగిలిన ఆరుగురు వ్యక్తుల వివరాలు వెల్లడవుతాయని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 30 : గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇల్లు, రూ.10 లక్షల సాయం అందించాలని డిమాండ్ చేస్తూ బావురావుపేట గ్రామ సమీపంలోని రాజన్న కాలనీ గుడిసెల వద్ద సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. చెన్నూర్ ఏరియా కార్యదర్శి చందు మాట్లాడుతూ.. రెండేళ్లుగా గుడిసెలు వేసుకొని పేద ప్రజలు జీవిస్తున్నారని, వారికి సదుపాయాలు లేవని తెలిపారు. సీపీఎం నాయకులు శ్యామల, ఉమారాణి, సిడాం సమ్మక్క, సరిత, శారద తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కాగజ్‌నగర్, డిసెంబర్ 30 : ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లహుకుమార్ డిమాండ్ చేశారు. జనవరి 8న నిర్వహించే చలో హైదరాబాద్ పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే విడుదల చేయాలని, లేకపోతే సచివాలయం ముట్టడిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఉన్నారు.

చైనా మాంజాలు అమ్మితే చర్యలు

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 30 : సంక్రాంతి పండుగ నేపథ్యంలో గాలిపటాలు ఎగురవేసేందుకు చైనా మాంజాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రానున్న రోజుల్లో అటవీశాఖ అధికారులు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తారని తెలిపారు. నిషేధిత మాంజాలు కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో పాటు, పక్షులకు ఇబ్బంది కలిగించే మాంజాలు విక్రయించవద్దని, అధికారులకు సహకరించాలని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి

నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 30 : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో సోమవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల కార్యాలయం వద్ద అమిత్ షా దిష్టి బొమ్మ దహనం చేశారు. అనంతరం స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద ప్ల కార్డులతో నిరసన తెలిపారు. అమిత్ షా కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్ కుమార్, గొడిసెల కార్తిక్, టీకానంద్, కృష్ణమాచారి, తిరుపతి, రమ్య ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

తాండూర్, డిసెంబర్ 30 : తాండూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ సమీపంలో గల రైల్వే సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ ఘాతానికి గురైన ఇందారపు సురేశ్ (32) సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్‌కు చెంది సురేశ్-శారధ దంపతులు ఆదివారం రాత్రి కేజీబీవీ దగ్గరలోని రైల్వే సబ్ స్టేషన్ వద్దకు పని నిమిత్తం వెళ్లారు. ప్రమాదవశాత్తు సురేశ్ షాక్‌కు గురవగా, గాయపడ్డాడు. వెంటనే బెల్లంపల్లి దవాఖానకు, అక్కడి నుంచి కరీంనగర్ తరలించారు. కాగా, పరిస్థితి విషమించడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య శారధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నూతన సంవత్సర సందడి

మందమర్రిలోని మార్కెట్‌లో ఏర్పాటైన రంగుల దుకాణాలు

మందమర్రి, డిసెంబర్ 30 : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పట్టణంలోని మార్కెట్, పాతబస్టాండ్, పాలచెట్టు ఏరియాల్లో సందడి నెలకొన్నది. ఆయా ఏరియాల్లో రంగుల దుకాణాలు వెలిశాయి. ప్రజలు వివిధ రకాల రంగులు కొనుగోలు చేశారు. దీంతో దుకాణాల వద్ద సందడి కనిపించింది.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మందమర్రి, డిసెంబర్ 30 : యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ రాజశేఖర్ సూచించారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రూపొందించిన వాల్ పోస్టర్లను సోమవారం ఎస్ఐ విడుదల చేశారు. అందరూ అప్రమత్తంగా ఉండి, చుట్టు పక్కల డ్రగ్స్ ఉన్నట్టు అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

వ్యవసాయ క్షేత్రం సందర్శన

సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన కల్పిస్తున్న శంకర్

హాజీపూర్, డిసెంబర్ 30 : ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పాత మంచిర్యాలలోని గోనె శ్యామ్‌సుందర రావు వ్యవసాయ క్షేత్రంలో గుడిహత్నూర్‌కు చెందిన రైతులు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు సేంద్రియ వ్యవసాయంపై పలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు. సేంద్రీయ వ్యవసాయం వల్ల భూసారం పెరిగి, భూమి బలంగా తయారవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డు శంకర్, కొట్టె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటాలు

కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 30 : విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అనేక పోరాటాలు చేసినట్లు ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు వసాకే సాయికుమార్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమావారం కాగజ్‌నగర్ జూనియర్ కళాశాలలో జెండా ఎగురవేశారు. జిల్లా కమిటీ సభ్యులు కార్తిక్, రక్షిత, రాణి, టీనా, వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి

దండేపల్లి, డిసెంబర్ 30 : జాతీయ ఆహార భద్రత మిషన్ 2024-25 పథకంలో భాగంగా దండేపల్లి మండల కేంద్రంలోని ఏవో కార్యాలయ ఆవరణలో సోమవారం రైతులకు వ్యవసాయాధికారి అంజిత్ కుమార్ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఆర్ఎన్ఆర్31479, కేఎన్ ఎం12368 మినికిట్ సన్న వరి రకాన్ని తానిమడుగు, దండేపల్లి గ్రామాలకు చెందిన రైతులకు అందించారు. వరి క్లస్టర్ డెమాంట్రేషన్‌కు సంబంధించి పీఎస్‌బీని పంపిణీ చేశారు. ఏఈవోలు, రైతులు ఉన్నారు.

వరి నాటుపై అవగాహన

మందమర్రి రూరల్, డిసెంబర్ 30 : మండలంలోని పొన్నారం గ్రామంలో రైతులకు వరి నాటు వేసే విధానంపై వ్యవసాయ అధికారి కిరణ్మయి అవగాహన కల్పించారు. గ్రామంలోని జాడి పున్నంనకు చెందిన పొలంలో నాటు వేసే సమయంలో వరి నారు వేర్లను రసాయన ద్రావణంలో ముంచే విధానంపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ విధానానికి క్లోర్ పైరిఫాస్ రసాయనిక ద్రావణాన్ని 2 మీ.లీ ఒక లీటరు నీటికి కలిపి నారు వేర్లను దాదాపు 12 గంటల పాటు అందులో ఉంచాలని సూచించారు. ఆ తర్వాత నాటు వేస్తే నెల రోజుల వరకు రోగ కారక పురుగులు ఆశించకుండా పంటను కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి ముత్యం తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ మాధవి

కాగజ్‌నగర్, డిసెంబర్ 30 : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవి సూచించారు. పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో సోమవారం విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. వాహనాలు నడిపే వారు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఆమె వెంట వసతి గృహం వార్డెన్ యేసుమని, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టిదందాపై దృష్టిపెట్టాలి

తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

బెల్లంపల్లి, డిసెంబర్ 30 : పట్టణంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు సంబంధించిన ప్రభుత్వ భూముల్లో రోజు రోజుకూ పెరుగుతున్న మట్టిదందాపై అధికారులు దృష్టి పెట్టాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ జ్యోత్స్నకు వినతి పత్రం సమర్పించారు. మట్టి తరలిస్తూ చదునుగా ఉన్న భూమిని గుంతలు చేస్తూ ట్రాక్టర్ యజమానులు లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పశుగణనతో రైతులకు మేలు

పశుగణన వివరాల సేకరణ పరిశీలిస్తున్న వైద్యుడు నరసింహారావు

తాండూర్, డిసెంబర్ 30 : సమగ్ర పశుగణనతో పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా రైతులకు ఆర్థికంగా మేలు కలుగుతుందని తాండూర్ పశు వైద్యాధికారి పీవీ నరసింహారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సిబ్బంది నిర్వహిస్తున్న పశుగణన వివరాల సేకరణను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. సిబ్బంది దుర్గం కళ్యాణ్, అన్నం మల్లేశ్, సికినం సాయి, చెంద్ర దాసు, రాధిక తదితరులు పాల్గొన్నారు.